కాకొండకు కంకర రోడ్డే దిక్కు

- అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నడికూడ : అసంపూర్తిగా ఉన్న రోడ్డుతో ప్రజలే కాదు, కంకర తెలిన రోడ్డుపై మూగజీవాలు కూడా నడువలేక తల్లడిల్లుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కాకొండతో పాటు పరకాల, అంబాల-హనుమకొండ ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి వచ్చే రోడ్డుపై గతంలో తారు ఉండగా పూర్తిగా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ క్రమంలో నూతన రోడ్డు నిర్మాణ పనులకు సుమారు 65 లక్షల అంచనాతో కాకొండ క్రాస్ రోడ్డు నుంచి నూతన గ్రామపంచాయతీ వరకు 2.5 కిలోమీటర్ల వరకు పనులు ప్రారంభించి పాత రోడ్డును తొలిగించారు. నూతన రోడ్డు నిర్మాణంలో భాగంగా సదరు కాంట్రాక్టర్ కంకర పోసి అసంపూర్తిగా వదిలేశారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో వాహనదారులకు, గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డుగుండా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళల్లో ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అంటున్నారు.



కాకొండకు వెళ్లే దారిలో కంకర తేలిన రోడ్డు

గాయాలపాలవుతున్నాం



బీటీ రోడ్డు అంటూ కంకర పోసి కాంట్రాక్టర్ చేతులేత్తేశాడు. కంకర తేలి ఉండడంతో కాలి నడక కూడా ఇబ్బందిగా మారింది. ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

– మేకల ప్రవీణ్, కాకొండ

దుమ్ముతో అనారోగ్యం



రోడ్డు పనులు ప్రారంభించి దాదాపు సంవత్సరం కావస్తోంది. కంకర రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. వాహనాలు వెళ్తుంటే దుమ్ము, ధూళి వస్తుంది. దీంతో అనారోగ్యం బారిన పడుతున్నాం.

– చుక్క రత్నాకర్ -కాకొండ

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

దామెర : చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతిచెందింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వావిలాల ఈశ్వరమ్మ (65) కూలీ పనుల చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. కాగా రెండు నెలల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈనెల 25 తెల్లువారుజామున గుర్తు తెలియని పురుగుల మందుతాగి తాగి అపస్మారక స్థితికి వెళ్లింది. గమణించిన బంధువులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింనట్లు తెలిపారు.

మైసూర్ ఎక్స్‌ప్రెస్‌ను వరంగల్‌కు నడిపించాలి



ఐనవోలు : మైసూర్ ఎక్స్‌ప్రెస్‌ను కాచిగూడ హైదరాబాద్ వరకు మాత్రమే కాకుండా వరంగల్ వరకు సేవలను పొడగించాలని కోరుతూ సికింద్రాబాద్ రైలు నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌కు మండలంలోని నందనం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ ఉల్లెంగుల యాదగిరి శుక్రవారం వినతిపత్రం అందించారు. చారిత్రక నేపథ్యం కలిగిన మైసూర్, వరంగల్ మధ్య డైరెక్టు రైలు కనెక్టివిటీ ఉంటే పర్యాటకులు గణనీయంగా పెరుగుతారని వినతిలో పేర్కొన్నారు. వరంగల్‌లో చారిత్రక నేపథ్యం కలిగిన వేయి స్తంబాల గుడి, భద్రకాళి గుడితో పాటు వరంగల్ కోట, రామప్ప, సమ్మక్క సారమ్మల వనదేవతల గుడులు ఉన్నాయని వివరించారు.

రెండు పంటలకు 'రైతు భరోసా' ఇవ్వాలి



నడికూడ : రైతులకు రుణమాఫీ పూర్తి కాకపోవడం, వానకాలం పంటలకు ఇప్పటి వరకు రైతు భరోసా పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రైతులు ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక వడ్డీకి అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వర్షాకారం, యాసంగి పంటలకు ఒకేసారి రైతు భరోసా పెట్టుబడి సాయం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

న్యాయవాది రమేశ్‌బాబు మృతి తీరనిలోటు



పరకాల : అనారోగ్యంతో సీనియర్ న్యాయవాది కూనమల్ల రమేశ్‌బాబు మృతి తీరనిలోటని బార్ అసోసియేషన్ సభ్యులు విచారణ వ్యక్తం చేశారు. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం అధ్యక్షుడు పెండ్యాల భద్రయ్య మాట్లాడారు. సామాజిక స్పృహతో పాటు కక్షిదారులతో సహృదయంగా ఉండే సీనియర్ న్యాయవాదిని కోల్పోవడం చాలా బాధకరమన్నారు. న్యాయవాదులు గండ్ర నరేశ్‌రెడ్డి, వెంకటరమణ, ప్రవీణ్, రమేశ్, రాహుల్ విక్రమ్, శంకర్, సురేశ్, రాజేందర్, రవికుమార్, అశోక్, రఫీ, ఎం.డీ సబీర్ పాల్గొన్నారు.

పోస్ట్ డాక్టరల్ ఫెల్లోగా స్వామి

కేయూ క్యాంపస్: ప్రతిష్టాత్మకమైన ఐసీఎస్ఎస్ఆర్ పోస్ట్ డాక్టరల్ ఫెల్లోగా కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకుడు బానోతు స్వామి ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన ఆ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఏటూరి జ్యోతి పర్యవేక్షణలో పరిశోధన కొనసాగిస్తున్నారు. ఇప్పటికే డాక్టరేట్ కూడా అందుకున్నారు. గిరిజన సాహిత్యం గురించి అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలు 20కిపైగా ప్రచురించారు. ఈమేరకు బానోతు స్వామిని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, తదితరులు శుక్రవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలకు దినకర

రామన్నపేట: ఈనెల 30న హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ షూటింగ్ రేంజ్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్ -17 షూటింగ్ పోటీలకు నగరంలోని లాల్ బహదూర్ కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న జేవీఆర్‌హెచ్ దినకర్‌రావు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ఈమేరకు ఆయనను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల చైర్మన్ భాగ్యనారాయణ, సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్.వినయ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్, గేమ్స్ కమిటీ సభ్యులు మధుకర్‌రావు, రాఘవేందర్ రెడ్డి, కొత్తపల్లి సుధాకర్, సుచిత్ర, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

గుప్తనిధుల తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు

- పరకాల ఏసీపీ కిశోర్ కుమార్

దామెర: గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పరకాల ఏసీపీ కిశోర్ కుమార్ హెచ్చరించారు. పులుకుర్తి శివారులోని చంద్రగిరి గుట్టల్లోని ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దామెర పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. అక్టోబర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుకోసం తవ్వకాలు జరపగా రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దామెర ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. బైరాన్‌పల్లికి చెందిన భూక్య శ్రీను, ఏనుమాములకు చెందిన గొలుసుల నరేష్, లక్ష్మీపూర్‌కు చెందిన భరత్ కుమార్, రంగశాయిపేటకు చెందిన లింగంపల్లి నాగరాజు, పాకాల అశోక్ నగర్‌కు చెందిన బొంత రమేష్ గ్రూపుగా ఏర్పడి తవ్వకాలు జరిపినట్లు గుర్తించామన్నారు. శుక్రవారం వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేస్తామని పేర్కొన్నారు. కేసును ఛేదించిన ఎస్సై అశోక్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిశోర్ కుమార్

విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

- సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్

శాయంపేట : విద్యార్థులు, యువకులు స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సును ప్రిన్సిపాల్ కందగట్ల కోటేష్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, గోల్ సెట్టింగ్, టైం మేనేజ్‌మెంట్, మానసిక రుగ్మతల నివారణ గురించి వివరించారు. మొబైల్ ఫోన్ అడిక్షన్‌కు దూరంగా ఎలా ఉండాలో ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులు ఇష్టపడి చదువుకొని లక్ష్యాన్ని ఛేదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

భగీరథ ప్లాంట్‌ను సందర్శించిన విద్యార్థులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని మిషన్ భగీరథ ప్లాంట్‌ను కాజీపేట మండలంలోని మడికొండ మాస్టర్‌జీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. స్టడీ టూర్‌లో భాగంగా సందర్శించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మిషన్ భగీరథ నీరు శుద్ధి జరిగే తీరు,ఎలా సరఫరా అవుతుందని అక్కడి అధికారులను విద్యార్థులు అడిగితెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రీమాల, శైలజ, ఉదయశ్రీ, సంగీత, మన్సన్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లాంట్‌ను సందర్శించిన విద్యార్థులు

దామేశ్వరాలయంలో దీపారాధన



దామెర : దీపారాధనలో పాల్గొన్న మహిళలు

దామెర : మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో శుక్రవారం దీపారాధన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల రాజుశర్మ వేద మంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు పాల్గొని ఆలయ సమీపంలోని గిద్దె చెరువులో దీపారాధన చేపట్టారు. కార్యక్రమానికి ముందు పార్వతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లలిత సహస్ర పారాయణం పఠించారు. ఈ సందర్భంగా శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సోమవారం, శుక్రవారం శివాలయంలో ప్రత్యేక పూజలు, పార్వతి అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివ పార్వతుల కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఉద్యమానికి పునాది.. నవంబర్ 29



వేలేరు : అమరవీరల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



శాయంపేట : భూపాలపల్లికి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేలేరు : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధనలో కీలకమైన రోజు నవంబర్ 29 అని మాజీ జెడ్పీటీసీ చాడ సరిత అన్నారు. మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపానికి శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులంతా హనుమకొండలోని ఓ థియేటర్‌లో కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్) చిత్రాన్ని వీక్షించారు. మండల ఇంచార్జ్ భూపతిరాజు, మండల కోఆర్డినేటర్ సురేష్, మాజీ సర్పంచ్‌లు మాధవరెడ్డి, వీరయ్య, మాజీ ఎంపీటీసీలు జ్యోతి, సంధ్య, గ్రామశాఖల అధ్యక్షులు తిరుపతి ,శ్రీనివాస్, సాంబయ్య, నాయకులు జాని, ప్రవీణ్, శ్యామ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

శాయంపేట : బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతిలో ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షదివస్‌కు మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. నాయకులు గంటా శ్యాంసుందర్ రెడ్డి, విజయ్‌కుమార్, మోహన్, రాజేందర్, బాబు, రమేశ్, భాస్కర్, చంద్రమౌళి ఉన్నారు.

మహనీయుల స్ఫూర్తి ఆదర్శం

విద్యారణ్యపురి: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే మహనీయుల జీవితాలను చదివి స్ఫూర్తిని పొందాలని మోటివేషనల్ స్పీకర్ సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్ సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో విద్యార్థులకు సంస్కార వికాస శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడుతూ థామస్ ఎడిసిన్, ఐన్‌స్టీన్ వంటి శాస్త్రవేత్తలు, అంబేడ్కర్, పూలే వంటి మహానుభావులు వారు చేరుకున్న అత్యున్నత స్థితికి వారి పేదరికం అడ్డుకాలేదని గుర్తుచేశారు. డ్రగ్స్, మత్తుపదార్థాల జోలికి వెళ్లొద్దని అన్నారు. సమావేశంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్ అధ్యక్షత వహించగా మార్క రవీందర్‌గౌడ్, మలహాల్‌రావు, గంగారపు యాదగిరి, రాజమౌళి, హెచ్‌ఎం జగన్ పాల్గొన్నారు.

వరంగల్ -1 డిపోలో కార్తీక వనభోజనాలు

హన్మకొండ: హనుమకొండ ఆర్టీసీ వరంగల్ -1 డిపోలో అధికారులు, ఉద్యోగులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా, ఆటపాటల మధ్య కార్తీక వన భోజనాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పనిఒత్తిడిలో ఉండే ఉద్యోగుల మానసిక ఒత్తిడిని దూరం చేయడానికి యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భానుకిరణ్, పర్సనల్ ఆఫీసర్ అర్పిత, వరంగల్ -1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు, హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరమ్‌సింగ్, ఈఈ భాస్కర్, మెడికల్ ఆఫీసర్ కీర్తి పాల్గొన్నారు.


ఫుడ్ పాయిజన్ ఘటనలపై నిరసన

విద్యారణ్యపురి: హాస్టళ్లు, గురుకుల్లో ఫుడ్ పాయిజన్ సంఘటనపై స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద రోడ్డుపై శుక్రవారం నిరసన తెలిపారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో గురుకులాల్లోని విద్యార్థులు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల ఫుడ్ పాయిజన్‌తో చాలామంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని వాపోయారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ అభిషేక్, బాధ్యులు రాజేంద్రప్రసాద్, ఒంటేరు చక్రి, శివకుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను జయప్రదం చేయండి

వరంగల్: మాలలపై జరుగుతున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా డిసెంబర్ 1న హైదరాబాదులో నిర్వహించనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గ్రేటర్ వరంగల్ కన్వీనర్ పనికల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వద్ద ముడుసు నరసింహ ఆధ్వర్యంలో సింహగర్జన వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గ్రేటర్ వరంగల్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

65శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలి



విద్యారణ్యపురి: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 65శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలని ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఎస్‌టీయూ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఎస్‌టీయూ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం విడుదల చేయాలని సూచించారు. స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరికి స్థానికత కల్పించాలని కోరారు. స్పౌజ్, మ్యూచ్‌వల్ బదిలీలను చేపట్టాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కామగోని రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రాంబాబు, బాధ్యులు భీమనాథుని రవి, రమేష్, సుధాకర్‌రెడ్డి, మధులిమాయే, నాగరాజు, నర్సింహయ్య తదితరులు పాల్గొన్నారు.

'సర్వోదయ' సేవలు అభినందనీయం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఆత్మకూరు : ఆడపిల్లల రక్షణకు కృషి చేస్తున్న సర్వోదయ సంస్థ సేవలు అభినందనీయమని హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్ పాండే, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలకు లింగాధారిత హింసా నివారణ, సహకరించే వ్యవస్థల అనుసంధానంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. కుటుంబంలో ఆడపిల్ల విలువ, రక్షణ తెలియజేయాలని, ఆడ, మగ సమానం అనే భావనతో పిల్లలను పెంచాలని అన్నారు. గర్భందాల్చిన విషయం తెలిసినప్పటి నుంచి ఆడపిల్ల, మగపిల్లాడా అనే ఆలోచన చేయకూడదన్నారు. ఆడపిల్లలకు, మహిళలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అండగా నిలబడి సమస్యలను పరిష్కరించడంలో సహకరిస్తోందన్నారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, ఆత్మకూరు, దామెర మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ స్పందన, డాక్టర్ మంజుల, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్స్, సర్వో దయ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, ఇందిర, రవీందర్, శ్రీలత, చేరాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్షమా దేశ్ పాండే, పక్కన డీఎంహెచ్‌ఓ అప్పయ్య

కీమోథెరపీ చికిత్సలో ఫార్మసిస్టులు కీలకం



మాట్లాడుతున్న డాక్టర్ తిప్పని అవినాష్

దామెర : క్యాన్సర్ నివారణ చర్యల్లో భాగంగా కీమోథెరపీ చికిత్సలో ఫార్మసిస్టులు కీలకమని ప్రతిమా క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ తిప్పని అవినాష్ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఇంటిగ్రేటింగ్ క్లినికల్ ఫార్మసీ ఇన్ అంకాలజీ అనే అశంపై అంకోఫార్మ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లినికల్ ఫార్మసిస్టులు మందుల చికిత్స నిర్వహన, మల్టీ డిసిప్లీనరీ విధానం ద్వారా వ్యాధి నివారణకు కృషి చేయవచ్చని అన్నారు. అంకోఫార్మ అనేది రోగి భద్రత, అంకాలజీ సంరక్షణలో మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. ఈ సదస్సు ద్వారా నాలేడ్జ్ షేరింగ్, క్లినికల్ ప్రాక్టీస్‌కు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. వైద్యులు, క్లినికల్ ఫార్మసిస్టులు సమిష్టి సహకారంతో రోగికి సేవలందించాలన్నారు. ఈ సదస్సులో యూనివర్సిటీ ఆఫ్ ఫ్రెండ్‌లే అధ్యాపకుడు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాహుల్ నారాయణ్, అవెనొడో ఇన్నోవేషన్ సీఈఓ డాక్టర్ కార్తీక్, డాక్టర్ బ్రహ్మణీ, తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, డైరెక్టర్ తాళ్ల వరుణ్, వైష్ణవి, ఫార్మాసి కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజం

- పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి

దామెర : ప్రతి ఉద్యోగికి విరమణ సహజమని పీఆర్టీయూ(టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని సీతారాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే చల్లా కొండమాధవ రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మాధవరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కొండమాధవరెడ్డి ఉపాధ్యాయునిగా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని అన్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేసిందని గుర్తుచేశారు. అదే విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని శ్రీపాల్‌రెడ్డి కోరారు. సమావేశంలో మండల విద్యాధికారి రాజేష్ కుమార్, కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ, ఇంచార్జ్ హెచ్‌ఎం చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, జిల్లా నాయకులు గఫర్, ఉపేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింగరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మకంటి శరత్‌కుమార్, భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొండమాధవరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర : బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్‌కు చెందిన మన్నెం రాంరెడ్డి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆయన రాంరెడ్డి భౌతికకాయంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఊరుగొండకు చెందిన నల్ల సారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, సుదర్శన్ కార్యకర్తలు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మారెడ్డి

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- ఎంఈఓ భిక్షపతి

శాయంపేట : విద్యార్థులు ఇష్టపడి చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంఈఓ భిక్షపతి అన్నారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు సూచనలు చేశారు. అనంతరం ప్రత్యేక తరగతుల సమయంలో స్నాక్స్ ఇవ్వటం లేదని, మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండటం లేదని, గేమ్స్‌కు సమయం కేటాయించడం లేదని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంఈఓ క్రీడలతోనే శారీరక, మానసికోల్లాసం లభిస్తుందని అన్నారు. విద్యార్థులకు ఇష్టమైన క్రీడల్లో ఫిజికల్ డైరెక్టర్‌తో శిక్షణ ఇప్పించాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావుకు సూచించారు. మధ్యాహ్న భోజనంపై టేస్ట్ రిజిస్టర్‌లో భోజనం బాగుందా లేదా అనే వివరాలు రాయాలని విద్యార్థులకు సూచించారు. స్నాక్స్ విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ భిక్షపతి

మండల కమిటీ ఎన్నిక

ఐనవోలు : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) మండల కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవీందర్ శుక్రవారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా నరసింహ చార్యులు, ప్రధాన కార్యదర్శిగా రాము, ఉపాధ్యక్షుడిగా విజయ్‌భాస్కర్‌రెడ్డి, మహిళ ఉపాధ్యక్షురాలిగా శారద, కోశాధికారిగా అశోక్, కార్యదర్శులుగా పరమేశ్వర్, సురేఖ, జ్యోతి, స్వప్న, సుమలత, అయోషా అఫ్రీన్, కుటుంబరావు, శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులతో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పెండెం రాజు ప్రమాణస్వీకారం చేయించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. జిల్లా కార్యదర్శులు సీఎస్ఆర్ మల్లిక్, చుంచుకాల లింగారావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సదానందం, పూర్వకమిటీ నాయకులు బ్రహ్మచారి, పరమేశ్వర్ పాల్గొన్నారు.